క్లుప్తంగా

పోలమ్మ మహోత్సవాలు ప్రారంభం



అమ్మవారిని గ్రామంలోకి తీసుకెళ్తున్న దృశ్యం

పాతపట్నం: మండలంలోని తెంబూరు గ్రామంలో చింతల పోలమ్మ మహోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా గ్రామస్తులందరూ అమ్మవారి ఆలయం వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి, తొలిరోజు మంగళ వాయిద్యాల నడుమ దేవరను గ్రామంలోకి తీసుకొచ్చారు. ఊరేగింపులో సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ వి.రామారావు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

బాధ్యతగా వ్యవహరించాలి



మాట్లాడుతున్న ఎంఈవో రాజారావు

పొందూరు: ప్రభుత్వం ఏర్పాటు చేసిన సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్లను పాఠశాలలకు పంపిణీ చేసే విషయంలో మండల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు బాధ్యతగా వ్యవహరించాలని ఎంఈవో–1 గట్టు శ్రీరాములు, ఎంఈవో–2 పట్నాన రాజారావులు సూచించారు. స్థానిక ఎమ్మార్సీలో ఎమ్మార్సీ సిబ్బందితో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ కిట్లు ప్రభుత్వ విద్యార్థులందరికీ అందేలా చూడాలన్నారు.

చెత్త సంపద కేంద్రం పరిశీలన



చెత్త సంపద కేంద్రం పరిశీలిస్తున్న అధికారులు

బూర్జ: మండలంలోని కాళపర్తి పంచాయతీలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని డీఎల్‌పీవో ఐ.వి.రమణ శుక్రవారం పరిశీలించారు. వర్మీ కంపోస్ట్ ఏవిధంగా తయారు చేయాలి, ఇంటింటా చెత్త సేకరణ విషయాలను గ్రీన్ అంబాసీడర్లకు వివరించారు. గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్యం మెరుగుపర్చుకుంటే అందరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బిర్లంగి వరహాలనాయుడు, పంచాయతీ కార్యదర్శి అమర్నాథ్, బూర్జ కార్యదర్శి బి.కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విజయదుర్గ ఉత్సవాలు



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

సరుబుజ్జిలి: మండలంలోని పురుషోత్తపురం గ్రామంలో విజయదుర్గ అమ్మవారి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు ఆరవెల్లి భాస్కరశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, కుంకుమ పూజలు, సహస్ర నామార్చనలు, హోమాలు చేపట్టారు. పూజల్లో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

నరసన్నపేట: స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జెమ్స్ ఆస్పత్రి వైద్యులు వచ్చి 78 మందికి వైద్య పరీక్షలు చేపట్టారు. ఈసీజీ, కళ్లు, షుగర్, బీపీ పరీక్షలు ఉచితంగా చేశారు. అవసరమైన రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరాన్ని విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎస్.ప్రభాకరరావు ప్రారంభించారు. అనంతరం సంఘ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జెమ్స్ ఆస్పత్రి వైద్యులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

పరీక్ష ఫలితాలు విడుదల

బూర్జ: మండలంలోని ఓవీపేట ఏపీ మోడల్ స్కూల్ 6వ తరగతి పరీక్ష ఫలితాలు గురువారం రాత్రి విడుదలైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ బొడ్డేపల్లి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. ప్రవేశ పరీక్షకు 193 మంది విద్యార్థులు హాజరవ్వగా, 132 మంది విద్యార్థులు ఎంపికైనట్లు వివరించారు.

ఆటోవాలా..

బతుకు డీలా..!

- పెరుగుతున్న ఇంధనం ఖర్చులతో కుదేలు
- ఎన్నికల హామీ నెరవేర్చని కూటమి ప్రభుత్వం
- ఏటా రూ.15 వేలు ఇస్తామని హామీ
- అమలు చేసి ఆదుకోవాలని వేడుకోలు



ఆటోవాలాలకు కూటమి ఇచ్చిన హామీ



అమదాలవలస: ఆటో డ్రైవర్ల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తరచూ పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతుండడంతో తిప్పలు తప్పడం లేదు. ప్రస్తుతం లీటర్ డీజిల్ ధర రూ.99, పెట్రోల్ ధర రూ.110 వరకూ ఉంది. దీంతో ఆటోలను నమ్ముకుని జీవనం కొనసాగిస్తున్న కార్మికులు బెంబేలెత్తిపోతున్నారు. నియోజకవర్గంలో ఆమదాలవలస, ఆమదాలవలస మున్సిపాలిటీ, సరుబుజ్జిలి, పొందూరు, బూర్జ మండలాల్లో ఆటోలు ఉన్నాయి. బస్సులు లేనపుడు ప్రయాణికులు ఆటోలపైనే ఆధారపడి గమ్యస్థానాలకు చేరుకుంటారు. ముఖ్యంగా ఆర్టీసీ బస్సులు లేని గ్రామీణ ప్రాంతాలకు ఆటోలే ఆధారం.

ప్రభుత్వ నిర్లక్ష్యం

కష్టాల్లో ఉన్న ఆటో కార్మికులను ఆదుకునే విషయంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆటో కార్మికులు విమర్శిస్తున్నారు. ఆటో కార్మికులకు ఏడాదికి రూ.15 వేలు చొప్పున ఇస్తామని, ప్రత్యేకంగా సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తామని ఎన్నికల్లో సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. అయితే అధికారంలోకి వచ్చి 10 నెలలు గడుస్తున్నా హామీ అమలు చేయడం లేదని మండిపడుతున్నారు.

తగ్గిన ఆదాయం.. పెరిగిన ఖర్చులు

ఆటో నిర్వాహణకు సాధారణంగా ఖర్చులుంటాయి. ప్రస్తుతం పెరుగుతున్న డీజిల్, పెట్రోల్ ధరలతో ఆటో కార్మికుడికి రోజంతా కష్టపడితే కనీసం రూ.200ల నుంచి రూ.300లు వరకు కూడా మిగలని పరిస్థితి నెలకొంది. ఏటా ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల కోసం దాదాపు రూ.15 వేలు దాకా ఖర్చు అవుతోంది. దీంతో పాటు తనిఖీల పేరుతో పోలీసులు, రవాణా శాఖాధికారులు దాడులు చేసి రూ.వేలల్లో జరిమానాలు విధించడం, ఆటో కొనుగోలు కోసం తీసుకున్న రుణాలకు నెలవారీ ఇన్‌స్టాల్‌మెంట్లు కట్టుకోలేక ఆటో కార్మికుల బతుకులు దినదినగండంగా మారిపోయాయి. వచ్చే అరకొర డబ్బు ఇంధనం, ఇతర ఖర్చులకే సరిపోతున్నాయని వాపోతున్నారు.

మండలం	ఆమదాలవలస	ఆమదాలవలస మున్సిపాలిటీ	సరుబుజ్జిలి	బూర్జ	పొందూరు
ఆటోల సంఖ్య	120	85	125	160	230

రూ.15 వేలు ఇవ్వాల్సిందే

రోజంతా కష్టపడి ఆటో నడిపినా కుటుంబ పోషణ కష్టంగా మారింది. నిత్యావసర సరుకులతో పాటు ఇంధన ధరలు పెరిగిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఆటోల ఫైనాన్స్, పెరిగిన బీమా ప్రీమియం, రోడ్డు టాక్స్‌లు కట్టుకోలేక సతమతమవుతున్నాం. ఎన్నికల హామీ మేరకు ప్రభుత్వం ఆటో కార్మికులకు రూ.15 వేలు చొప్పున ఇవ్వాలి.

– పి.రామారావు, నిమ్మతొర్లువాడ పంచాయతీ, ఆమదాలవలస

కుటుంబ పోషణ భారం

15 ఏళ్లుగా ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాను. ప్రస్తుతం డీజిల్, పెట్రోల్ ధరలు ఆకాశాన్ని అంటుతున్న తరుణంలో కుటుంబ పోషణ భారంగా మారింది. దీనికి తోడు గతంలో మాదిరి ప్రస్తుతం ఆటోలకు అంతగా గిరాకీ ఉండడం లేదు. ఇలాంటి పరిస్థితి నుంచి ఆటో డ్రైవర్లకు ఆర్థికంగా సాయం చేయాలి. మమ్మల్ని ప్రభుత్వం ఆదుకోవాలి.

– ఎస్.శ్రీనివాసరావు, తోటవాడ పంచాయతీ, బూర్జ

గత ప్రభుత్వంలో భరోసా

ఎన్నికల హామీ మేరకు గత ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం ఏటా బడ్జెట్ కేటాయించేది. అర్హులైన ఆటో, టాక్సీ, మాక్సీక్యాబ్ డ్రైవర్లకు ఏడాదికి రూ.10 వేలు చొప్పున వారి ఖాతాల్లో జమ చేసింది. దీంతో పాటు వాహన డ్రైవర్ ప్రమాదవశాత్తు మృతి చెందితే వారి కుటుంబ సభ్యులకు రూ.10 లక్షల బీమా వర్తింపజేశారు. అలాగే రవాణా వాహన కొనుగోలుకు బ్యాంకు నుంచి రుణాలు తీసుకునే డ్రైవర్లకు రూ.3 లక్షల వరకు వడ్డీ రాయితీ అందించి భరోసా కల్పించారు.

– గోవిందరావు, ఆమదాలవలస పట్టణం, ఆటో డ్రైవర్

వేసవి క్రీడా శిక్షణ ప్రారంభం



శిక్షణ శిబిరంలో కోచ్‌లు, విద్యార్థులు

పాతపట్నం: స్థానిక ఆల్ ఆంధ్ర రోడ్డు సమీపంలోని మహేంద్ర డిగ్రీ కళాశాల ఆవరణలో జిల్లా ప్రభుత్వ స్పోర్ట్స్ అథారిటీ (డీఎస్‌ఏ) ఆధ్వర్యంలో క్రికెట్, వాలీబాల్ ఉచిత వేసవి శిక్షణ తరగతులను పాతపట్నంకు చెందిన పీడీ వై.శేఖర్‌బాబు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. క్రికెట్, వాలీబాల్ క్రీడల్లో నెల రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నామన్నారు. జె.కృష్ణ, డి.లక్ష్మణరావు, జె.శ్రీను, ఎల్.గణేష్, కె.రాంబాబు, బి.లోకేష్‌లు ప్రత్యేక కోచ్‌లుగా వ్యవహరిస్తారని తెలియజేశారు. కార్యక్రమంలో పార్వతీశం, రాంబాబు, కె.శ్రీనివాసరావు, ఎల్.మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

బాలికలు ధైర్యంగా ఉండాలి



నరసన్నపేట: మాట్లాడుతున్న మహిళా పోలీసు భాగ్యలక్ష్మి

నరసన్నపేట: బాలికలు వేధింపులను ధైర్యంగా ఎదుర్కోవాలని మహిళా పోలీసు భాగ్యలక్ష్మి సూచించారు. కిషోర్ వికాస్ బాలికల వేసవి సెలవుల కార్యక్రమంలో భాగంగా స్థానిక కలివరపుపేట అంగన్‌వాడీ కేంద్రంలో కిషోర బాలికలకు శుక్రవారం అవగాహన కలిగించారు. బాలికలను అసభ్య పదజాలంతో దూషించినా, ఫోన్లో మాట్లాడినా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. నాణ్యమైన ఆహార నియమాలు పాటించాలని, పౌష్టికాహారం తీసుకోవాలని పేర్కొన్నారు. ఆత్మస్థైర్యం పెంపొందించుకోవాలని, క్షణికావేశాలకు గురై ఆత్మహత్యలకు పాల్పడవద్దని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం.సంధ్యారాణి, దోల మహాలక్ష్మి, వెంకట లక్ష్మి, జి.పుణ్యావతి, ఆర్.సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

పాతపట్నం: కిశోర బాలికలకు ఆరోగ్యంపై అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది సమన్వయంతో అవగాహన కల్పించాలని పాతపట్నం సీడీపీవో టి.విమలరాణి అన్నారు. స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో కిశోరి బాలికలకు అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో బాలికలందరికీ రక్తహీనత, రుతుక్రమ పరిశుభ్రత నిర్వహణ, లైంగిక దాడులు, లింగ అసమానతలు, బాల్య వివాహాలపై పంచాయతీ పరిధిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈవో కిషోర్, సూపర్‌వైజర్ అనూరాధ, ఎంపీటీసీ రేణుక, శిర్ల జోగారావు, పోలాకి నరేష్, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



పాతపట్నం: మాట్లాడుతున్న సీడీపీవో విమలరాణి

అభివృద్ధికి ఆమడ దూరం

- ఎండిపోయిన మినీ రిజర్వాయర్
- ఏటా అన్నదాతకు అవస్థలు



గుర్రపుడెక్కతో ఉన్న చెరువు

సరుబుజ్జిలి: మండలంలోని కొత్తకోట గ్రామానికి ఎగువ భాగాన 175 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పెద్ద చెరువును బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా తీర్చిదిద్దేందుకు 2006లో సుమారు రూ.43 లక్షల నిధులు అధికారులు మంజూరు చేశారు. ఈ రిజర్వాయర్‌ను అభివృద్ధి చేసి వంశధార కాలువ ఇన్‌ఫ్లో నుంచి వచ్చిన సాగునీరు వృథాగా పోకుండా నిల్వచేసి, అవుట్ ఫ్లో ద్వారా 18 గ్రామాలకు చెందిన 1,200 ఎకరాల భూములకు ఖరీఫ్, రబీ సీజన్‌లో నీరు అందించేందుకు నిర్ణయించారు. రిజర్వాయర్‌లో నీటిని స్టోరేజ్ చేయాలంటే సుమారు 10 అడుగుల లోతు ఉండాలి. అయితే సుమారు ఏళ్ల తరబడి రిజర్వాయర్‌లో పూడిక తీయలేదు. దీనివలన పూడిక పేరుకుపోయి రిజర్వాయర్ మైదానాన్ని తలపిస్తోంది. దీని వలన సాగునీరు నిల్వ అవ్వక వృథాగా బయటకు పోతోంది. గుర్రపు డెక్క అధికంగా పేరుకుపోవడం వలన అవుట్ ఫ్లో ద్వారా సాగునీరు ప్రవహించే సమయంలో ఇబ్బందులు వస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చర్యలు తీసుకోవాలి

అధికారులు కొత్తకోట రిజర్వాయర్ నిర్వహణ విషయంలో పూర్తిగా పట్టించుకోవడం లేదు. షట్టర్లు మరమ్మతులకు గురయ్యాయి. సాగునీటి విడుదల సమయంలో రైతులు నానా కష్టాలు పడుతున్నారు. రెండు పంటలకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలి.

– సురవరపు నాగేశ్వరరావు, రైతు, కొత్తకోట

పరిశీలన చేస్తాం

మినీ రిజర్వాయర్ మరమ్మతుల కోసం అధికారుల దృష్టిలో పెట్టాము. వెంటనే పరిశీలన చేసి సత్వర చర్యలు తీసుకుంటాము. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– పి.వెంకటరావు, జేఈ, వంశధార

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

పాతపట్నం: పాతపట్నం మేజర్ పంచాయతీ పరిధిలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ డీఈఈ జి.ప్రసాదరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతులు, వీధిలైన్ల నిర్వహణ కారణంగా సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారరు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

బాధ్యతల స్వీకరణ



జడ్జి వాణికి స్వాగతం పలుకుతున్న కొండలరావు

నరసన్నపేట: స్థానిక మేజిస్ట్రేట్ కోర్టుకు బదిలీపై శృంగవరపుకోట నుంచి వచ్చిన జూనియర్ సివిల్ జడ్జి ఎస్.వాణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రావాడ కొండలరావుతో పాటు సభ్యులు ఆమెకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోర్టు నిర్వహణకు, కేసుల సత్వర పరిష్కారానికి సహకరించాలని కోరారు.

పీహెచ్‌సీ వైద్యులపై విచారణ

పాతపట్నం: మండలంలోని బైదలాపురం పీహెచ్‌సీ ఆస్పత్రిలో గతంలో పనిచేసిన ఇద్దరు వైద్యులపై సీఎంవో కార్యాలయం ఆదేశాల మేరకు జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ కె.అనిత శుక్రవారం విచారణ చేపట్టారు. ఆస్పత్రిలో గతంలో డాక్టర్ సదాశివ, డాక్టర్ సత్యవేణిలు పనిచేశారు. సదాశివ తన విధులకు అటంకం కల్పిస్తున్నారని డాక్టర్ సత్యవేణి సీఎంవో కార్యాలయంకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు డీఎంహెచ్‌వో, డిప్యూటీ డీఎంహెచ్‌వో మేరీ కేథరీన్, డీఐఓ రామదాసు, సూపరింటెండెంట్ భాస్కర్‌కుమార్, ఏవో భాస్కర్‌లు కలిసి వైద్యులను, వైద్య సిబ్బందిని వేర్వేరుగా ఒక గదిలో విచారణ చేపట్టారు. డాక్టర్ సదాశివ ప్రస్తుతం రిటైర్డ్ అయ్యారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ చేపట్టామని, విచారణను ఉన్నతాధికారులు అందజేస్తామని డీఎంహెచ్‌వో తెలిపారు.

దేవస్థానం లాకర్ల తనిఖీలు



పరిశీలిస్తున్న జేఈవో రవి తదితరులు

ఆమదాలవలస: పట్టణంలోని వేంకటేశ్వర స్వామివారి దేవస్థానానికి చెందిన బంగారం, వెండి ఆభరణాలకు సంబంధించిన బ్యాంక్ లాకర్లను అధికారులు, దేవస్థాన అర్చకులు శుక్రవారం పరిశీలించారు. స్థానిక స్టేట్ బ్యాంక్, ఆంధ్రబ్యాంక్ లాకర్లలో సుమారు 20 సంవత్సరాల నుంచి ఇటువంటి తనిఖీలు చేయలేదు. రాజమండ్రికి చెందిన పల్లంరాజు జ్యూయలరీ వెరిఫికేషన్ అధికారి, ఆలయ జేఈవో టి.రవి, బరంపురానికి చెందిన మాజీ ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఆధ్వర్యంలో దేవస్థానం ముఖ మండపంలో లాకర్ల తనిఖీలు నిర్వహించడం జరిగింది. గతంలో దేవస్థాన కార్యనిర్వాహణ అధికారులుగా విధులు నిర్వహించిన సర్వేశ్వరరావు, శ్యామలరావు, కుమారస్వామి, వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించిన లాకర్ల పరిశీలనలో బంగారం మరియు వెండి ఆభరణాలు సక్రమంగా ఉన్నాయని దేవస్థాన జేఈవో రవి ధ్రువీకరించారు.

దేవుళ్ల విగ్రహాలు ధ్వంసం



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసు సిబ్బంది

కొత్తూరు: మండలంలోని నేతాజీనగర్ కాలనీలో ఆంజనేయ స్వామివారి గుండి ముందు ఉన్న ఆంజనేయస్వామి, శ్రీవత్సవల దేవి, వినాయకుడి విగ్రహాలను గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. శుక్రవారం ఉదయం విగ్రహాలు ధ్వంసమైనట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఇన్‌చార్జి సీఐ రామారావు, ఎస్‌ఐ ఎండీ అమీర్ ఆలీ, హిరమండలం మండలం ఎస్‌ఐ ఎండీ యాసిన్‌లు సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఈ విషయంపై విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం దుండగుల దాడిలో పాడైన విగ్రహాలను శిల్పిని తెప్పించి బాగుచేశారు.

కార్యాలయాల్లో నిలిచిన కార్యకలాపాలు



రెవెన్యూ కార్యాలయంలో ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్న కంప్యూటర్ గది

ఆమదాలవలస రూరల్: మండలంలో గురువారం రాత్రి కురిసిన వర్షం ప్రభావం ప్రభుత్వ కార్యాలయాలకు కూడా తాకింది. ప్రధానంగా పలు ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ సరఫరా పూర్తిగా లేకపోవడంతో కార్యాలయాల్లో కార్యకలాపాలు శుక్రవారం పూర్తిగా నిలిచిపోయాయి. ఆమదాలవలస పట్టణ పరిధిలో కొంత ఏరియాకు విద్యుత్ సరఫరా యంత్రం వరకు రాకపోవడంతో సిబ్బంది పనిచేసేందుకు అవకాశం లేకుండా పోయింది. ఆమదాలవలస రెవెన్యూ కార్యాలయంతో పాటు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి కూడా విద్యుత్ సరఫరా లేకపోవడంతో విలువైన కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోయాయి. అంతేకాకుండా ఉపాధి హామీ, వెలుగు, మండల అభివృద్ధి, మార్కెట్ కమిటీ, ట్రెజరీ వంటి కార్యాలయాలు విద్యుత్ సరఫరా నిలిచిన ప్రదేశంలో ఉండడంతో వివిధ పనులపై వచ్చిన ప్రజలు వెనుదిరిగారు.

ఫీల్డు అసిస్టెంట్‌పై విచారణ



విచారణ చేపడుతున్న ఏపీడీ లోకేష్

సారవకోట: మండలంలోని కుమ్మరిగుంట పంచాయతీ ఉపాధి హామీ ఫీల్డు అసిస్టెంట్ రాజారావుపై కుమ్మరిగుంట గ్రామంలో ఏపీడీ లోకేష్ శుక్రవారం విచారణ చేపట్టారు. చోడసముద్రం గ్రామానికి చెందిన పలువురు వ్యక్తులు జిల్లా కలెక్టర్, డ్వామా పీడీలకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్లు ఆయన తెలిపారు. పనులకు వెళ్లనటువంటి వారిపేర్లు మస్తర్లలో నమోదు చేస్తున్నారని, వేతనదారుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈ మేరకు కుమ్మరిగుంట ప్రాథమిక పాఠశాలలో వేతనదారులు, ఫిర్యాదుదారులతో ముఖాముఖి విచారణ చేపట్టారు. ఆయనతో పాటు ఏపీవో నారాయణరావు, టీఏ శివ ఉన్నారు.

ఇద్దరు యువకుల మధ్య ఘర్షణ

బూర్జ: మండలంలోని లక్కుపురం గ్రామ జంక్షన్‌లో గురువారం ఇద్దరి యువకుల మధ్య జరిగిన ఘర్షణ కొట్లాటకు దారి తీసింది. స్థానిక పోలీసులు, గ్రామస్తులు తెలిపిన సమాచారం మేరకు పాలవలస గ్రామానికి చెందిన అల్లుబోయిన మణికంఠకు, లక్కుపురం గ్రామానికి చెందిన పవన్‌కు మధ్య గొడవ జరిగింది. మణికంఠ మేనల్లుడు లోకేష్, లక్కుపురం గ్రామానికి చెందిన పవన్ ఇరువురూ స్నేహితులు. వీరి ఇరువురి మధ్య జనవరిలో ఒక పెళ్లిలో గొడవ జరిగింది. అది దృష్టిలో పెట్టుకొని గురువారం ఉదయం పవన్ పాలకొండ వెళ్లడానికి లక్కుపురం జంక్షన్‌లో ఆటో కోసం వేచి ఉండగా, మణికంఠ రావడంతో మాటామాటా పెరిగి ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో పవన్ చేతికి బలమైన గాయం తగిలింది. వెంటనే పవన్ చికిత్స నిమిత్తం పాలకొండ ఏరియా ఆస్పత్రికి వెళ్లాడు. ప్రస్తుతం అక్కడ వైద్యం పొందుతున్నాడు. అక్కడ నుంచి అవుట్ పోస్టు సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు గురువారం రాత్రి స్థానిక ఎస్‌ఐ ఎం.ప్రవల్లిక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వర్ష బీభత్సం

జిల్లాలో గురువారం రాత్రి వర్ష బీభత్సం సృష్టించింది. ఈదురుగాలులతో కూడిన వర్షం భారీ నష్టాలను కలిగించింది. ఎక్కడికక్కడే చెట్లు రహదారులకు అడ్డంగా కూలిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకూలి, వైర్లు తెగిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. అరటి, మొక్కజొన్న పంటలు నేలకొరిగి రైతులకు అపార నష్టం వాటిల్లింది. పలుచోట్ల పిడుగులు పడడంతో ప్రజలు ఆందోళన చెందారు.

– సాక్షి నెట్‌వర్క్



ఆమదాలవలస రూరల్: ముద్దాడపేట వద్ద రహదారికి అడ్డంగా పడిన చెట్టు



ఆమదాలవలస: ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా కూలిన చెట్టు



ఆమదాలవలస రూరల్: కనుగులవలస వద్ద వర్షపు నీటితో నిండిన రైల్వే అండర్ టన్నల్ వే



ఎల్.ఎన్.పేట: రాలిపోయిన మామిడి కాయలు



ఎల్.ఎన్.పేట: ట్రాన్స్‌ఫార్మర్ మార్చుతున్న విద్యుత్ సిబ్బంది



ఆమదాలవలస రూరల్: కలివరం సమీపంలో రహదారికి అడ్డంగా పడిన చెట్టు



ఆమదాలవలస: రావికండిపేటలో కూలిన విద్యుత్ స్తంభం